ఎమ్మెల్యే పల్లాను పరామర్శించిన హరీశ్‌రావు



ఎమ్మెల్యే పల్లాను పరామర్శిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

చర్చిలో కుటుంబ సభ్యులతో ప్రార్థనలు చేస్తున్న ఇన్నారెడ్డి

చేర్యాల, జూన్ 20: ఇటీవల గాయపడి సోమాజిగూడ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని శుక్రవారం మాజీ మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు పల్లా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఎమ్మెల్యే మాణిక్యరావు, చింతా ప్రభాకర్, వివేక్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌రావు ఉన్నారు.

ఎమ్మెల్యే పల్లా కోలుకోవాలని ప్రార్థనలు

చేర్యాల, జూన్ 20 : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలో అడుగుపెట్టాలని కోరుతూ చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండల లాల క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బీరెడ్డి ఇన్నారెడ్డి తన కుటుంబ సభ్యులతో చర్చిలో ప్రార్థనలు జరిపారు. హైదరాబాద్‌లోని మెట్టుగూడ చర్చికి ఇన్నారెడ్డి తన కుటుంబ సభ్యులతో వెళ్లి ప్రార్థనలు చేశారు.

ప్రొసీడింగ్ పత్రాలతో వెల్కటూర్ గ్రామస్తులు

ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ

సిద్దిపేట అర్బన్, జూన్ 20: మండల పరిధిలోని వెల్కటూర్ గ్రామానికి చెందిన 61 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు శుక్రవారం రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బొల్లు నరేశ్, బత్తిని పెద్ద లింగం, రాచమల్లు కనకయ్య, పంచాయితీ కార్యదర్శి బాలరాజు పాల్గొన్నారు.

600 ఫీట్లలోపే ఇండ్లు నిర్మించుకోవాలి

ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్‌లను అందజేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

ప్రొటోకాల్ పాటించాలని వేడుకుంటున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు

- **కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి**

సిద్దిపేట అర్బన్, జూన్ 20: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు 400 ఫీట్లకు తగ్గకుండా 600 ఫీట్లకు మించకుండా ఇల్లు నిర్మించుకోవాలని కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని కొండ భూదేవి గార్డెన్స్‌లో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి ఆయన లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాడు ఇందిరాగాంధీ పేదరికం దూరం చేయాలని పలు పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దేశంలో ఎక్కడా చేయని విధంగా రూ.23 వేల కోట్ల పంటరుణమాఫీ చేశామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేటలో అడ్వాన్స్ టెక్నాలజీతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభిస్తామన్నారు.

స్టేజీ పైన కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట పట్టణంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రొసీడింగ్స్ అందజేసే కార్యక్రమం ఏర్పాటు చేసింది. అయితే ప్రభుత్వ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హల్‌చల్ చేశారు. స్టేజీపైన అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు కాంగ్రెస్ నాయకులు కూర్చోవడంపై అక్కడ ఉన్నవారు కొంత అసహనానికి గురయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు దయచేసి ప్రొటోకాల్ పాటించాలని మున్సిపల్ కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులను వేడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలన సామాజిక బాధ్యత

మీర్జాపూర్‌లో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న జేఏసీ ప్రతినిధులు

హుస్నాబాద్‌రూరల్, జూన్ 20: డ్రగ్స్ నిర్మూలనను ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని హుస్నాబాద్ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి అన్నారు. జేఏసీ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్ర కార్యక్రమం శుక్రవారం మండలంలోని మీర్జాపూర్, వంగ రామయ్యపల్లి, భల్లూనాయక్‌తండా, మాల పల్లి, తోటపల్లి, గాంధీనగర్ గ్రామాల్లో జరిగింది. ఈ సందర్భంగా కవ్వ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువత జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. ఒకప్పుడు మహానగరాల్లో దొరికే డ్రగ్స్ నేడు మారుమూల పల్లెల్లోకి విస్తరించడం బాధకరమన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్స్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జేఏసీ కో ఆర్డినేటర్ డ్యాగల సారయ్య, చెప్యాల ప్రకాష్, ఏపీఎం భిక్షపతి, లోడీ ప్రతినిధులు ఉప్పుల కుమారస్వామి, కోడూరి శ్రీదేవి, గాండ్ల పద్మ, వేముల జగదీష్, తాళ్లపల్లి జగన్, బండి రమణారెడ్డి, మాజీ సర్పంచ్ ఇస్లావత్ రజిత, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చేయని పనులకు డబ్బులు విత్‌డ్రా!

- **వల్లంపట్ల స్కూల్ గేట్ కోసం రూ. లక్ష నిధులు మంజూరు**
- **డబ్బులు తీసుకొని పనులు చేయని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్**
- **నోటీసులు పంపినా నో రిప్లై**



ఏఏపీసీ చైర్మన్ ఇంటికి అంటించిన నోటీసు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 20: చేసిన పనులకు డబ్బులు రావడం లేదని ఓవైపు కాంట్రాక్టర్లు తలలు పట్టుకుంటుంటే ఇక్కడ మాత్రం కొందరు చేయని పనికి ముందస్తుగానే ప్రభుత్వ నిధులను విత్‌డ్రా చేసుకున్నారు. పూర్తి వివరాలలోకి వెళ్తే... మద్దూరు మండలంలోని వల్లంపట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో మైనర్ నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిర్మాణ పనులను ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ(ఏఏపీసీ) చైర్మన్‌కు అప్పజెప్పింది. అయితే పాఠశాలలో మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణంతో పాటు చిన్న చిన్న పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పూర్తిచేసి రూ. 70వేలు తీసుకున్నారు. ఇదే క్రమంలో పాఠశాల ముందు గేట్ నిర్మాణ పనుల కోసం సదరు చైర్మన్, హెచ్‌ఎం కలిసి పాఠశాల అకౌంట్‌లో నుంచి సుమారు ఏడాది క్రితం రూ. లక్ష నిధులను విత్‌డ్రా చేసి గేట్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ దశలో 16ఎంఎం స్టీల్‌కు బదులుగా 8ఎంఎం స్టీల్ వినియోగిస్తుండడంతో గ్రామస్తులు దీనిపై అభ్యంతరం తెలిపారు. పనులను పర్యవేక్షించిన పీఆర్ ఏఈ సైతం 8ఎంఎం స్టీల్ వాడడంపై అభ్యంతరం తెలిపారు. దీంతో చైర్మన్ గేట్ నిర్మాణ పనులను అర్ధాంతరంగా వదిలేశారు. నిర్మాణ పనులను పూర్తి చేయాలని చైర్మన్‌ను పలుమార్లు హెచ్‌ఎం కోరినప్పటికీ స్పందించకపోవడంతో చివరగా ఆమెకు నోటీసులు కూడా జారీ చేశారు. సదరు నోటీసులను చైర్మన్ తీసుకోకపోవడంతో చైర్మన్ ఇంటి గోడకు నోటీసులను అతికించారు. ఏడాదిగా రూ. లక్ష డబ్బులను తన స్వంతానికి వాడుకుంటూ గేట్ నిర్మాణ పనులను పూర్తి చేయకపోవడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సఉన్నతాధికారులు స్పందించి పనులు చేయకముందే డబ్బులు డ్రా చేసిన చైర్మన్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు గేట్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కాగా, పాఠశాల ముందు గేట్ నిర్మాణం కోసం తీసిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. విద్యార్థులు నిత్యం ఆ గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారని వారు తెలిపారు.

రసాభాసగా ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ

దుబ్బాకలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరీ ప్రొసీడింగ్ పత్రాల పంపిణీలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం

సభలో పోలీసుల తీరుపై సిద్దిపేట ఏసీపీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

సభలో కాంగ్రెస్ నాయకుల తీరుతో అసహనం వ్యక్తం చేస్తున్న మంత్రి వివేక్

- **దుబ్బాకలో ప్రొటోకాల్ పాటించని కాంగ్రెస్ నాయకులు**
- **నిరసన వ్యక్తం చేసిన బీఆర్ఎస్ నాయకులు**
- **కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య హోరాహోరీగా నినాదాలు**
- **కాంగ్రెస్ నాయకుల అత్యుత్సాహంపై మంత్రి వివేక్ అసంతృప్తి**

దుబ్బాక, జూన్ 20: తొలిసారిగా సిద్దిపేట జిల్లా దుబ్బాకకు వచ్చిన మంత్రి వివేక్‌కు నిరసనలు వెల్లువెత్తాయి. దుబ్బాక పట్టణంలోని రజినీకాంత్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం మధ్యాహ్నం నియోజకవర్గంలోని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సభా వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫొటో చిన్నగా పెట్టారు. దీనిపై బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్, జిల్లా అదనపు కలెక్టర్‌ను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆనంతరం కార్యక్రమానికి వచ్చిన మంత్రి వివేక్‌కు ఎమ్మెల్యే స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. మంత్రి వెంట వేదికపైకి కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వచ్చారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు ప్రొటోకాల్ పాటించాలని డిమాండ్ చేశారు. ప్రొటోకాల్ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఎమ్మెల్యే సూచించారు. మంత్రి వివేక్ జోక్యంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ప్రసంగాన్ని అడ్డుకునేందుకు పనిగట్టుకుని కాంగ్రెస్ నాయకులు ప్రయత్నాలు చేశారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల నినాదాలతో సభాప్రాంగణం దద్దరిల్లింది. కలెక్టర్ హైమావతి కార్యక్రమాన్ని సజావుగా కొనసాగించాలని సూచించారు. ఈ విషయంలో మంత్రి వివేక్ సొంత పార్టీ కాంగ్రెస్ నాయకుల తీరుపై ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో ఆరువేల మంది పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇచ్చినట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారెంటీలు అమలు కావడం లేదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎస్సీ, ఎస్టీలకు రూ. 6లక్షలు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన రాజేశ్వర్‌రావు

ప్రతి మొక్కరూ మొక్కలు నాటాలి

గజ్వేల్, జూన్ 20: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలని హరితసేన జిల్లా కన్వీనర్ చెప్యాల రాజేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం తన పుట్టినరోజు సందర్భంగా మున్సిపల్ పరిధిలోని త్రిశక్తి ఆలయంలో మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటిని పరిరక్షించుకోవాలన్నారు. కేసీఆర్ మంచి సంకల్పంతో హరితహారం ప్రారంభించి కోట్లాది మొక్కలు నాటించడంతోనే నేడు అడవుల విస్తీర్ణం పెరిగిందన్నారు. ఆనాడు కేసీఆర్ చేపట్టిన హరితహారం ఎంతో విజయవంతమైందన్నారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అంతకు ముందు హైదరాబాద్‌లో మాజీమంత్రి హరీశ్‌రావును కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో సీఆర్ఆర్ టీం సభ్యులు పాండల శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజ్ఞాపూర్‌లో మొక్కలు నాటుతున్న చెప్యాల రాజేశ్వర్‌రావు

బెల్టు షాపులను నివారించడంలో ప్రభుత్వం విఫలం

భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

మిరుదొడ్డి, జూన్ 20: గ్రామాల్లో వెలిసిన బెల్టుషాపులను ప్రభుత్వం వెంటనే తొలిగించేలా చర్యలు చేపట్టాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మిరుదొడ్డిలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఎక్సైజ్ సీఐ కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రేవంత్ గ్రామాల్లో ఎక్కడా మద్యం బెల్టుషాపులు ఉండకుండా చూస్తానని హామీనిచ్చి నేడు తుంగలో తొక్కారన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కమలాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, మాజీ ఎంపీపీ కవితాశ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ రాములు, ఏఎంసీ మాజీ చైర్మన్లు బాపురెడ్డి, సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, సీనియర్ నాయకులు లింగం, మల్లేశం, దుర్గారెడ్డి, మల్లయ్య, కుమార్, శేఖర్, ఎక్సైజ్ శాఖ పోలీసులు పాల్గొన్నారు.

బాధితురాలిని పరామర్శించిన ఎమ్మెల్యే

అన్నపూర్ణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

మిరుదొడ్డి, జూన్ 20: అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రంగయ్యగారి జెన్నారెడ్డి సతీమణి అన్నపూర్ణ శుక్రవారం గుర్తుతెలియని దుండగులు ఆమె తలపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చి బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. జిల్లా కేంద్రమైన సిద్దిపేటలోని ఓ దవాఖానలో ప్రాణాపాయ స్థితిలో ఉండి చికిత్స పొందుతున్న బాధితురాలు అన్నపూర్ణను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి పరామర్శించారు. బాధితురాలి ఆరోగ్య వివరాలను వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ అక్బర్‌పేట–భూంపల్లి మండల సీనియర్ నాయకుడు పంజాల శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

అక్రమ వసూళ్లు చేస్తున్నా పట్టించుకోరా...

రశీదును చూపిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి

హుస్నాబాద్‌టౌన్, జూన్ 20: హుస్నాబాద్ పశువుల అంగడిలో తైబజార్ డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ఆరోపించారు. హుస్నాబాద్‌లో జరుగుతున్న అంగడిని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా క్రయవిక్రయాల్లో మున్సిపల్ నిర్ణయించిన ధరలకంటే ఎక్కువగా ప్రజలనుంచి వసూళ్లు చేస్తున్నారని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్‌వీ నాయకుడు మేకల వికాస్‌యాదవ్ ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులు అందజేత

ఉద్యోగులకు అవార్డులు అందజేస్తున్న డీఎం

హుస్నాబాద్‌టౌన్, జూన్ 20: హుస్నాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన ఉద్యోగులకు ప్రగతి చక్ర, బెస్ట్ ఈపీకే కేఎంపీఎల్ నగదు బహుమతులను శుక్రవారం డీఎం వెంకన్న అందజేశారు. స్థానిక డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అవార్డులు దక్కించుకున్న ఉద్యోగులను మిగతా వారు ఆదర్శంగా తీసుకుని సంస్థకు మంచిపేరు తీసుకురావాలన్నారు. హుస్నాబాద్‌డిపోను లాభాల బాటలో పయనింపజేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ మురళీతోపాటు పలువురు అవార్డు గ్రహీతలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు సీసీ కెమెరాల అందజేత

కొమురవెల్లి: సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్: పాఠశాలకు మైక్‌సెట్ సౌండ్ సిస్టంను అందజేస్తున్న చెలిమేటి రాజు

కోహెడ: క్రీడాదుస్తులు అందజేస్తున్న లక్ష్మారెడ్డి

కొమురవెల్లి, జూన్ 20: మండలంలోని ఐనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ముందుకు వచ్చారు. పూర్వ విద్యార్థి తేలు ఇస్తారి కృషితో పూర్వ విద్యార్థులు రూ. 30వేల విలువగల సీసీ కెమెరాల సెట్, వైఫై సెట్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగా శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బాల నర్సయ్య, రాజేందర్‌రెడ్డి, స్వామిగౌడ్, సాయిలు, రమేశ్, సుధాకర్, బాలయ్య, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

మైక్‌సెట్ సౌండ్‌సిస్టం అందజేత

గజ్వేల్, జూన్ 20: మండలంలోని బూరుగుపల్లి ప్రాథమిక పాఠశాలకు బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చెలిమేటి రాజు పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థుల కోసం మైక్ సెట్ సౌండ్ సిస్టం, 50మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పలకలను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాపిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల వితరణ

కోహెడ, జూన్ 20: మండలంలోని వింజపల్లికి చెందిన బీఎస్‌పీ లక్ష్మారెడ్డి ఆయన తమ్ముడు కోటేశ్వర్‌రెడ్డి జ్ఞాపకార్థం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ. 10 వేల విలువ చేసే క్రీడాదుస్తులను శుక్రవారం అందజేశారు. పెరుకలగడ్డ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవివర్మ, సిబ్బందిని ఆయన అభినందించారు.

తహసీల్ కార్యాలయానికి తాళం

- **నిరసన వ్యక్తం చేసిన కొండపోచమ్మ భూ నిర్వాసితులు**

తహసీల్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్న భూనిర్వాసితులు

ములుగు, జూన్ 20: భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు చేసి రెండేండ్లు కావొస్తున్నప్పటికీ నేటి వరకు కొండపోచమ్మ భూనిర్వాసితులకు అందాల్సిన పరిహారం విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల బాధిత కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతూ వారి జీవితాలను అర్ధాంతరంగా ముగిస్తున్నారు. తాజాగా కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ముంపునకు గురైన ములుగు మండలం మామిడ్యాల్‌లో నష్టపరిహారం అందక మూడు నెలల క్రితం గుండెపోటుతో తండ్రి మృతిచెందగా గురువారం రాత్రి కొడుకు దాచారం అనిల్ (23) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం... పునరావాస గ్రామం మామిడ్యాల్‌కు చెందిన దాచారం మల్లయ్య, యాదమ్మ దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కొండపోచమ్మ రిజర్వాయర్‌లో భాగంగా ఐదెఎకరాల 30 గుంటల వ్యవసాయ భూమి, ఇల్లు పూర్తిగా ముంపునకు గురైంది. ఈ నేపథ్యంలో తండ్రి మల్లయ్యతో పాటు పెద్ద కొడుకుకు ఫ్యామిలీ ప్యాకేజీ , ఇండ్లు, పెండ్లి కాని మరో ఇద్దరు కొడుకులకు ప్లాటుతో పాటు ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీలు ప్రభుత్వం నుంచి అందాల్సి ఉండగా నేటికీ ఎలాంటి పరిహారం అందలేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టు తిరుగుతూ ఎన్నిసార్లు తమ గోడు విన్నవించినప్పటికి ఫలతం లేకపోవడంతో మనోవేదనకు గురై గుండెపోటుతో మూడు నెలల క్రితం తండ్రి మల్లయ్య మృతిచెందాడు. తండ్రి మరణానంతరం కుటుంబ భారం మోస్తున్న మల్లయ్య చిన్న కుమారుడు దాచారం అనిల్ (23) తమకు రావాల్సిన నష్టపరిహారం విషయమై అధికారులకు పలుమార్లు విన్నవించాడు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో మనస్తాపానికి గురై గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన

కొండపోచమ్మ రిజర్వాయర్ భూనిర్వాసితులు ములుగు తహసీల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. కొండపోచమ్మ జలాశయం నిర్మాణంలో మండలంలోని మామిడ్యాల్, బైలంపూర్, తానేదార్‌పల్లి, తానేదార్‌పల్లి తండా పూర్తిగా ముంపునకు గురయ్యాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందక నిర్వాసితులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో శుక్రవారం మృతుడి కుటుంబీకులతో కలిసి భూ నిర్వాసితులు తహసీల్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయంలోకి అధికారులు వెళ్లకుండా తలుపులు మూసి తాళం వేసి నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న నాయకులు సైతం కార్యాలయానికి చేరుకొని నిర్వాసితులకు మద్దతుగా నిలిచారు. రిజర్వాయర్ నిర్మాణంలో భూములు, ఇండ్లు కోల్పోయిన వారందరికీ ప్రభుత్వపరంగా రావాల్సిన పరిహారం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ ఆరీఫా జోక్యం చేసుకొని ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలోనే అర్హులందరికీ పరిహారం అందిస్తామని హామీనిచ్చారు. దీంతో భూనిర్వాసితులు నిరసన విరమించారు.

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందజేయాలి

గజ్వేల్, జూన్ 20: మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ భూనిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న ప్యాకేజీలను వెంటనే విడుదల చేయడంతో పాటు నిర్వాసితులకు ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరుతూ శుక్రవారం డీబీఎఫ్ ఆధ్వర్యంలో ప్రజ్ఞాపూర్‌లోని హరిత హోటల్ వద్ద కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్‌కు వినతి పత్రాన్ని జాతీయ కార్యదర్శి శంకర్, రాష్ట్ర కార్యదర్శి ఎగొండస్వామి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని గజ్వేల్, ములుగు మండలాల్లో ఉంటున్న నిర్వాసితులకు పూర్తి స్థాయిలో ప్యాకేజీలు అందజేయాలన్నారు. గజ్వేల్ ప్రాంతంలో ఈఎస్ఐ దవాఖానను ఏర్పాటు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య రాష్ట్ర మంత్రి వివేక్‌కు వినతిపత్రం అందజేశారు.



దోస్త్ గడువు పొడిగింపు

సిద్దిపేట టౌన్, జూన్ 20: డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందుటకు రూపొందించిన దోస్త్ ఆన్‌లైన్ అడ్మిషన్స్ సర్వీసెస్ ప్రక్రియ మూడవ విడతను తెలంగాణ ఉన్నత విద్యామండలి ఈనెల 25 వరకు పొడిగించిందని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత శుక్రవారం తెలిపారు. రెండో విడతలో రిజిస్ట్రేషన్ చేయలేని విద్యార్థులు మూడవ విడతలో కొత్తగా రిజిస్ట్రేషన్ల కొరకు దోస్త్ వైబ్‌సైట్‌ను సందర్శించి ఈనెల 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వెబ్ ఆప్షన్స్ 25వరకు ఇవ్వవచ్చని, వీరికి 28న సీట్లను కేటాయిస్తామని, మూడవ విడతలో సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 28 నుండి 30 వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. వీరు ఈనెల 28 నుండి జూలై ఒకటిలోపు వ్యక్తిగతంగా కళాశాలను సందర్శించి ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

సీసీ నిర్మాణానికి భూమిపూజ

మిరుదొడ్డి (అక్బర్‌పేట–భూంపల్లి), జూన్ 20: అక్బర్‌పేట–భూంపల్లి మండలం మోతెలో శుక్రవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, బీఆర్ఎస్ అక్బర్‌పేట–భూంపల్లి మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, సీనియర్ నాయకుడు పంజాల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రాజేశ్వర్, రవి, శ్రీనివాస్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవం

హుస్నాబాద్‌టౌన్, జూన్ 20: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ధర్మవీర్ యోగా శిక్షణా శిబిరం నిర్వాహకురాలు అయిలేని అనిత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు హాజరై కార్యక్రమాన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎల్లమ్మ చెరువు కట్ట వద్ద యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఎంఎండీ గ్రూప్ కోరింది.

ఏటీసీఎస్ మంజూరు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 20: మండలంలోని తోటపల్లికి అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీఎస్) మంజూరైనట్లు బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రకటనలో తెలిపారు. కార్మిక, ఉపాధి శిక్షణ, ఫ్యాక్టరీల శాఖతో టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ భాగస్వామ్యంతో ఈ సంస్థను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 46సెంటర్లను ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు.

కమలాయపల్లిలో రెవెన్యూ సదస్సు

దరఖాస్తు అందజేస్తున్న రైతు నాయకులు

చేర్యాల, జూన్ 20: మండలంలోని కమలాయపల్లిలో శుక్రవారం తహసీల్దార్ దిలిప్‌నాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా భూ సమస్యలు ఉన్న రైతులు సదస్సులో దరఖాస్తులను అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజేందర్‌రెడ్డి, నాయకులు శంకరాచారి, రాజేశ్, జనార్దన్‌రెడ్డి, దుర్గప్రసాద్, గంధమాల కనకయ్య పాల్గొన్నారు.

పెండింగ్ బకాయి బిల్లులను విడుదల చేయాలి

సిద్దిపేట టౌన్, జూన్ 20: సిద్దిపేట జిల్లా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఫీజు, పెండింగ్ బకాయి బిల్లులను తక్షణమై విడుదల చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని జిల్లా మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు కొదాది శ్రీనివాస్ సిద్దిపేటలో శుక్రవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

IN THE COURT OF THE I ADDL. JUNIOR CIVIL JUDGE AT SIDDIPET
EP No. 48 of 2022

Between:
Rao Brothers Chit Fund Pvt. Ltd, Siddipet Branch, Rep. by its authorized signatory and power of attorney holder Mr. P. Jagadeeshwara Chary, S/o. Soma Shekara Chary, Age: 54 Years, R/o. Siddipet. ...Petitioner / DHR

And

3. Kusangi Sudhakar Goud,
4. Mohd. Ather. ...Respondents / JDR's

To
JDR's 3. Kusangi Sudhakar Goud, S/o. Rajalingam, Occ: Asst. Engineer, Andhra Pradesh State Housing Corporation Ltd., Siddipet, Dist. Siddipet.
4. Mohd. Ather, S/o. Gulam Rasool, Occ: Asst. Engineer, Andhrapradesh State Housing Corporation Ltd., Siddipet, Dist. Siddipet.

పైన పేర్కొన్న ఇ.పి.లో మీరు జె.డి.ఆర్. నెం. 3, 4 లుగా ఉన్నారు. మీ నుండి డబ్బులు రాబట్టుటకై డి.హెచ్.ఆర్. కంపెనీ వారు అమలు దరఖాస్తు (ఇ.పి) వేసి ఉన్నారు. సదరు కేసులో మీకు ఎన్నిసార్లు కోర్టు ద్వారా నోటీసులు పంపినను మీకు ముట్టుటలేదు. కావున, ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, ఇట్టి కేసు వాయిదా తేది: 10-07-2025 నాడు కలదు. కావున, మీరు ఈ తేదీ లోపు గానీ అదే తేది రోజు గానీ మీ తరపున వకీలు ద్వారా గానీ పై కోర్టులో ఉదయం గంటలు 10.30 ని॥లకు హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనిచో అట్టి కేసు మీ యొక్క పరోక్షంలో తీర్మానించబడును అని తెలియజేయుచున్నాము.

(కోర్టు వారి అనుమతితో)
K.SHIVA CHARAN, M.A, LLM, Advocate & Notary
Siddipet-502 103 (T.S.), Cell: 9849341518.